క్లుప్తంగా

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో, ఉపాధ్యాయులు

కడియం: గ్రామంలోని మేకల దిబ్బ ఎంపీపీఎస్-4 స్కూలు వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈవో మణికుమార్ హాజరయ్యారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయిని పి.రమానాగేశ్వరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాలు ఆద్యంతం అలరించాయి. ఉపాధ్యాయులు టి.రమాప్రభ, ఈ.సూర్యనారాయణమ్మ, కె.శ్రీరామచంద్రమూర్తి, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉప సర్పంచ్‌గా వీరబాబు



వీరబాబును అభినందిస్తున్న పాలకవర్గ సభ్యులు

కడియం: మురమండ ఉప సర్పంచ్‌గా యర్రంశెట్టి వీరబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నిక పరిశీలకులు, ఈవోపీఆర్డీ రాంప్రసాద్ పర్యవేక్షణలో బుధవారం ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు వీరబాబుకు అభినందనలు తెలిపారు.

అండగా ఉంటాం



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న నాగేంద్ర

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో బొల్లినేని ఆసుపత్రిలో ప్రాణం కోసం పోరాటం చేస్తున్న ఫార్మసీ విద్యార్థినికి అండగా బీజేపీ నిలుస్తుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర హామీ ఇచ్చారు. గురువారం ఆసుపత్రిలో ఆమె కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. విద్యార్థినికి అందుతున్న వైద్యం, ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఈ విషయంపై పోలీసులు సమగ్ర విచారణ చేసి, నిందితుడికి తగిన శిక్ష పడేలా చేయాలని విజ్ఞప్తి చేశారు.

లైబ్రరీకి ఇంజినీరింగ్ పుస్తకాల అందజేత



లైబ్రేరియన్‌కు పుస్తకాలు అందజేస్తున్న సూర్యనారాయణ

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని డా.బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల లైబ్రరీకి డైట్ సీనియర్ లెక్చరర్ కొమ్ముల వెంకటసూర్యనారాయణ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్‌కి సంబంధించిన ఆరు విలువైన పుస్తకాలను అందించారు. కళాశాల సీనియర్ లైబ్రేరియన్ బాలాజీకి గురువారం వీటిని అందజేశారు. ఆయనకు ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

సినిమాలు



శ్యామల	:	రాబిన్‌హుడ్
సూర్య మినీ	:	ఎల్2 ఎంపురాన్
సూర్య ప్యాలెస్	:	దిల్‌రుబా, ఎవడేసుబ్రహ్మణ్యం
స్వామి	:	కోర్ట్
శివజ్యోతి	:	రాబిన్‌హుడ్
అనుశ్రీ	:	వీర ధీర శూర
ఊర్వశి	:	ఎల్2 ఎంపురాన్
మేనక	:	ఆర్టిస్ట్, కిస్ కిస్ కిస్సిక్
రంభ	:	షణ్ముఖ
కుమారి	:	మ్యాడ్ స్క్వేర్
అప్సర	:	మ్యాడ్ స్క్వేర్
అశోక	:	మ్యాడ్ స్క్వేర్
నామవరం		
వీఎస్ మహల్	:	రాబిన్‌హుడ్
ధవళేశ్వరం		
మురళీకృష్ణ	:	మ్యాడ్ స్క్వేర్
కడియం		
వెంకటసూర్య	:	రాబిన్‌హుడ్

ఆ కుర్చీ మాదే.. ఈ కాళ్లూ మావే..!

- సెల్‌ఫోన్లలో కాలం వెళ్లదీస్తున్న జీజీహెచ్ సిబ్బంది
- వచ్చామా.. వెళ్లామా అన్నట్టుగా వీరి వైఖరి
- గంటల తరబడి ఫోన్లలో ముచ్చట్లు
- ఆస్పత్రిలో పని చేసేది అంతంతమాత్రమే..



టెలి మెడిసిన్ విభాగంలో సెల్‌ఫోన్లు చూసుకుంటున్న వైద్య సిబ్బంది

కంబాలచెరువు: సెల్‌ఫోన్లకు ప్రపంచమంతా దాసోహం అంటోంది. మేమేం తక్కువ తిన్నామా అన్నట్టు వ్యవహరిస్తున్నారు స్థానిక ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిలో కొందరు సిబ్బంది. ఇల్లయినా.. ఆస్పత్రయినా మాకేంటి అన్నట్టు.. కుర్చీల్లో కాళ్లు పెట్టి మరీ జాలీగా సెల్‌ఫోన్లలో కాలం వెళ్లదీస్తున్నారు వీరు. వచ్చామా.. థంబ్ వేశామా.. ఫోన్లు మాట్లాడుకున్నామా.. సమయం ముగిస్తే ఇంటికి వెళ్లిపోయామా అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఆస్పత్రిలో ఎన్నో వార్డులు, వందల మంది వైద్య సిబ్బంది, ఆస్పత్రికి వచ్చే రోగులకు ఓపీ చీటీ ఇవ్వడం మొదలు.. వైద్య విభాగం వద్ద, మందులు తీసుకునే ప్రాంతం, ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో పాటు, పరిపాలనా విభాగం వద్ద సిబ్బంది అంతా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ పరుగులు పెడుతూనే ఉంటారు. అంత రద్దీగా రోగులు, సిబ్బందితో కిక్కిరిసి ఉంటుంది ప్రభుత్వాస్పత్రి. సరిగ్గా అదే సమయంలోనే కొందరు వైద్య సిబ్బంది ప్రశాంతంగా ఫోన్లు మాట్లాడుకోవడం, కబుర్లాడుకోవడం వంటివి చేస్తుండడం తరచూ కనిపిస్తోంది. ఏదో ఆస్పత్రిలో హాజరు వేయడానికి వచ్చాం, డ్యూటీ అయిపోగానే వెళ్లిపోవాలన్న రీతిలో వారి వ్యవహారం ఉంది. కిటకిటలాడుతున్న ఆస్పత్రిలో రోగులు, వారిని పరీక్షిస్తున్న వైద్యులు కనిపించరు. ఓపీ బిజీగా ఉంది కొంచెం చూడమన్నా, వేరే ఇతర వైద్య సేవలు అప్పగించినా, ఆస్పత్రి అధికారి ఏమైనా చెప్పినా ఆ క్షణం వరకు మాత్రమే పట్టించుకుంటారు. ఆ తర్వాత షరా మామూలే. ప్రభుత్వాస్పత్రిలో కొందరు వైద్య సిబ్బంది తీరు ఇలా నిత్యకృత్యమైంది.

టెలిమెడిసిన్ సేవలు అంతంతమాత్రమే..

రాష్ట్రవ్యాప్తంగా వైద్య సేవలందించేందుకు రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో టెలి మెడిసిన్ విభాగం అందుబాటులో ఉంది. ఇందులో మొత్తం ఐదుగురు వైద్య సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు సేవలందిస్తారు. వీరిలో గైనకాలజిస్ట్, జనరల్ మెడిసిన్ వంటి ఐదు రకాల సేవలను రాష్ట్ర వ్యాప్తంగా విలేజీల్లో ఏఎన్‌ఎంలు, హెల్త్ సెంటర్ల సిబ్బంది ద్వారా ప్రజలకు సేవలందిస్తారు. వీరిలో కొందరు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సేవలందించాల్సిన సమయంలో.. వారు సెల్‌ఫోన్లలో ముచ్చట్లు ఆడుకుంటూ, కుర్చీల్లో సేద తీరుతున్నారు. మధ్యాహ్నం భోజనం విరామమైనా సరే.. ఆస్పత్రి రద్దీగా ఉండే ఉదయం సమయంలోనూ ఇదే తీరుతో వ్యవహరిస్తున్నారు. వీరి వ్యవహారం తెలిసిన ఆస్పత్రి అధికారి వీరికి చెల్లించే జీతాల బిల్లు పెట్టేందుకు సైతం సుముఖత వ్యక్తం చేయడం లేదన్నట్టు ఆస్పత్రి వర్గాలు చర్చించుకుంటున్నాయి. తప్పనిసరిగా చివరి సమయంలో వీరి జీతాల బిల్లులపై సంతకాలు చేస్తున్నారంటున్నారు.



చర్యలు తీసుకుంటాం



ఆస్పత్రిలో రోగులకు సేవలందించే విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఎంతటి వారైనా సరే చర్యలు చేపడతాం. డ్యూటీ సమయంలో సెల్‌ఫోన్లు మాట్లాడుకోవడం, కబుర్లాడుకోవడం వంటివి చేస్తే సహించేది లేదు. ఆస్పత్రిలో అన్ని విభాగాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. నిత్యం వాటిని పర్యవేక్షిస్తున్నాం. ఎవరైనా విధుల్లో అలసత్వం వహిస్తే వెంటనే చర్యలు చేపడుతున్నాం. టెలిమెడిసిన్ విభాగంలో సేవలు పూర్తిగా అందేవిధంగా చూస్తాం.

– డాక్టర్ లక్ష్మీసూర్యప్రభ, సూపరింటెండెంట్, రాజమండ్రి ప్రభుత్వాస్పత్రి

తాగునీటి పథకం సిబ్బంది సమస్యపై దృష్టి

- మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి
- రెండు నెలల జీతాల చెక్కు అందజేత



నమూనా చెక్కు అందిస్తున్న మంత్రి దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి తదితరులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): పురుషోత్తపట్నం సత్యసాయి డ్రింకింగ్ వాటర్ వర్కర్స్ యూనియన్ ఉద్యోగుల సమస్య పరిష్కారానికి సాధ్యమైనంత త్వరగా జీతాలు, పీఎఫ్ బకాయిల చెల్లింపులు ఏజెన్సీ నిధుల నుంచి నేరుగా జరపడంపై దృష్టి సారిస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ పి.ప్రశాంతి వెల్లడించారు. గురువారం స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో యూనియన్ ప్రతినిధులకు రెండు నెలల జీతం రూ.20 లక్షల చెక్కును కలెక్టర్‌తో పాటు, ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ, ఈ సమస్యపై పూర్తి అవగాహన ఉందని, తప్పనిసరిగా పరిష్కార చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సీఎం, డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన నిధులతో రెండు నెలల జీతం చెల్లించారన్నారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ, ప్రభుత్వం నుంచి ఏజెన్సీకి చెల్లింపులు జరినప్పుడు పీఎఫ్ చెల్లింపుపై నిర్దిష్ట నిర్ణయం తీసుకునేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బీవీ గిరి, యూనియన్ నాయకులు కట్టమూరి వీరబాబు, ఉందుర్తి ఇస్సాక్ తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



భోజనశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల తదితరులు

కడియం: పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడంలో దాతల సహకారం అభినందనీయమని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. మండలంలోని దుళ్లలో రూ.15 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన భోజనశాలను గురువారం ఆయన ప్రారంభించారు. స్కూలు హెచ్‌ఎం సంధ్యారాణి అధ్యక్షత వహించారు. గ్రామానికి చెందిన చిట్టూరి వెంకన్నచౌదరి రూ.1.50 లక్షలు సమకూర్చగా, వాష్ సంస్థ రూ.13.5 లక్షలు మొత్తం రూ.15 లక్షల వ్యయంతో భోజన శాలను నిర్మించారు. అలాగే పాఠశాలకు రూ.10 లక్షల సొంత నిధులు వెచ్చించి మౌలిక వసతులు కల్పించిన యన్నమని లక్ష్మీపతి, చిట్టూరి వెంకన్నచౌదరి, ఆనంద్‌ను సత్కరించారు. అనంతరం ఎర్రకాలనీలో రూ.ఏడు లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. వేమగిరిలో రూ.25 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ భవనాలను ఎమ్మెల్యేతో పాటు, ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ ప్రారంభించారు. సర్పంచ్ కొండపల్లి పట్టియ్య, ఎంపీడీవో రమేష్, పలువురు నాయకులు పాల్గొన్నారు.



ఇఫ్తార్ విందులో పాల్గొన్న భరత్‌రామ్

అందరిపై అల్లా దీవెనలు ఉండాలి

ఇఫ్తార్ విందులో మాజీ ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: రంజాన్ మాసంలో కఠోర నియమాలు పాటిస్తున్న ముస్లింలు తమకున్న దానిలోనే పేదలకు దానం చేయడం అభినందనీయమని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ అన్నారు. గురువారం స్థానిక మెయిన్ రోడ్‌లోని పెద్ద మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. అల్లా దీవెనలు అందరిపైనా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

ముందస్తు అడ్మిషన్లను నిరోధించాలి

కంబాలచెరువు: విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో విచ్చలవిడిగా అడ్మిషన్లు జరుగుతున్నాయని పీడీఎస్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. కిరణ్ కుమార్ ఆరోపించారు. 2025–26కు సంబంధించి ఇప్పుడే పుస్తకాలు కొనాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులకు ఆయా విద్యాసంస్థల ప్రతినిధులు హుకుం జారీ చేస్తున్నారని గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ముందస్తు రిజర్వేషన్, ఫీజు వసూళ్లు, పుస్తకాల కొనుగోళ్లు, అక్రమ అడ్మిషన్లు అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత విద్యా సంవత్సరం ముగియకుండానే అడ్మిషన్ల కోసం తల్లిదండ్రుల సదస్సులు, విద్యార్థుల ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలు క్రమశిక్షణ రహితంగా వ్యవహరిస్తున్న తీరుపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం చేయాలని, గుర్తింపు లేని కొన్ని ప్రైవేటు పాఠశాలలను ఎలా అనుమతిస్తున్నారో డీఈఓ తెలపాలన్నారు. ఆయా విద్యాసంస్థల్లో పనిచేస్తున్న చిన్నారితకా ఉద్యోగులను ఎండలను సైతం లెక్క చేయకుండా, వివిధ ప్రాంతాల్లో ఇంటింటికీ తిప్పుతున్నారని, అడ్మిషన్లు చేపడుతున్నా ఎంఈఓలు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని చెప్పారు. వీటిపై డీఈవో విచారణ జరిపి, ఆయా విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయా అంశాలపై విద్యా శాఖ అడిషనల్ డైరెక్టర్‌కు వినతిపత్రం పంపినట్టు తెలిపారు.

ముగిసిన బైబిల్ మిషన్ మహాసభలు



మహాసభల్లో మాట్లాడుతున్న విజయరాజు

రాజమహేంద్రవరం రూరల్: రాజమండ్రి శానిటోరియం స్వస్థత శాలలో జరిగిన బైబిల్ మిషన్ 58వ మహాసభలు విజయవంతంగా ముగిశాయి. గురువారం మూడో రోజు ముగింపు సమావేశంలో బైబిల్ మిషన్ ప్రెసిడెంట్ బిషప్ డాక్టర్ ఎన్ విజయరాజు మాట్లాడుతూ, ఈ మహాసభలకు ఆంధ్రప్రదేశ్‌తో పాటు, తెలంగాణ, ఇతర ప్రాంతాల నుంచి విశ్వాసులు హాజరై, దేవుని మహిమ పరిచారన్నారు. ఏసుక్రీస్తు అందరికీ ప్రభువు అని, ఆయన బోధలను అనుసరిస్తూ సత్ప్రవర్తన కలిగి ఇహలోకంలో జీవించాలని తెలిపారు. బైబిల్‌లోని మర్మాలను ప్రజలకు తెలియజేసేందుకే మంగమూరి దేవదాసు అయ్యగారితో బైబిల్ మిషన్ ఏర్పాటైందని చెప్పారు. రాజమండ్రిలో ప్రారంభమై ప్రపంచ దేశాలకు వ్యాపించిన బైబిల్ మిషన్ ప్రజలను ఏసు మార్గంలోనికి నడిపిస్తుందన్నారు. మహాసభలకు సహకరించిన కేథడ్రల్, గోల్డెన్ జూబ్లీ, స్వస్థత శాల సంఘ పెద్దలకు, విశ్వాసులకు అభినందనలు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రోగుల కోసం ప్రత్యేక స్వస్థత ప్రార్థన చేశారు. ఈ కార్యక్రమంలో షాలేమురాజు, డి.సువర్ణరాజు, పీజే సుధాకర్, డా.ఎన్.సిమ్యోన్ సుదర్శన్, ఎన్.విలియం బెంటిక్, ఎస్.ఉషారాణి, స్వర్ణకుమారి పాల్గొన్నారు.

లారీ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

కంబాలచెరువు: నగరంలోని ఆల్కాట్ గార్డెన్స్ సమీపంలో లారీ ఢీకొన్న ఘటనలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. గురువారం ధవళేశ్వరం వైపు నుంచి రాజమహేంద్రవరం వస్తున్న లారీ.. రైల్వేస్టేషన్ సమీపంలో కాలినడకన వెళ్తున్న 37 ఏళ్ల వ్యక్తిని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి అక్కడికక్కడే చనిపోయాడు. లారీతో డ్రైవర్ పారిపోయేందుకు యత్నించగా, స్థానికులు అడ్డుకుని.. సమీపంలో ఉన్న రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఆటో ఢీకొని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం రూరల్: మోటార్ బైక్‌ను ఆటో ఢీకొన్న సంఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు, కాకినాడ జిల్లా తొండంగికి చెందిన పెదపూడి సురేష్(34) కొంతమూరు చెంచుకాలనీలో ఉంటూ కార్పెంటర్ పని చేస్తుంటారు. గురువారం మధ్యాహ్నం మేస్త్రీతో కలిసి మోటార్ బైక్‌పై సురేష్ రాజానగరం బయలుదేరారు. దివాన్‌చెరువు గైట్ కాలేజీ సమీపంలో వెనుక నుంచి ఆటో వారి బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో బైక్ వెనుక కూర్చున్న సురేష్‌కు తీవ్ర గాయాలు కావడంతో, చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్టు బొమ్మూరు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టెండర్లు పూర్తయినా.. పనులు చేపట్టరేం?

కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్ల నిలదీత



సమావేశానికి హాజరైన సభ్యులు

కొవ్వూరు: టెండర్లు పూర్తయినా పనులు ఎందుకు ప్రారంభించలేదో వివరణ ఇవ్వాలని పదో వార్డు కౌన్సిలర్ బత్తి నాగరాజు ప్రశ్నించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి అధ్యక్షతన గురువారం పురపాలక సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ మున్సిపల్ సాధారణ నిధుల నుంచి పదో వార్డులో సీసీ డ్రైన్ల నిర్మాణానికి ఏడాది క్రితం కౌన్సిల్ ఆమోదించడంతో, టెండర్ల ప్రక్రియ, సాంకేతిక అనుమతులు పూర్తయ్యాయన్నారు. గత కౌన్సిల్ సమావేశం నుంచీ అడుగుతున్నా పట్టించుకోవడం లేదని, కొందరు ఉద్దేశపూర్వకంగా ఆపుతున్నట్లు తెలిసిందన్నారు. పనులు తక్షణం ప్రారంభించాలని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ నాగరాజు డిమాండ్ చేశారు. దీనిపై కాంట్రాక్టర్‌కు నోటీసులు ఇవ్వాలని కమిషనర్ నాగేంద్ర కుమార్ ఏఈలకు సూచించారు. 13, 17 వార్డుల్లో నాలుగు డ్రైన్లు మంజూరైనా పనులు చేపట్టలేదని టీడీపీ ఫ్లోర్‌లీడర్ సూరపనేని చిన్ని చెప్పారు. 22వ వార్డు కౌన్సిలర్ కంఠమణి రమేష్‌బాబు మాట్లాడుతూ, పట్టణంలో ఏ వార్డులో ఎన్ని పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయ్యాయి, ఎన్ని ప్రారంభించారు, ఇంకా ఎన్ని చేపట్టాలనే వివరాలు కౌన్సిలర్లకు ఇవ్వాలని కోరారు. పట్టణంలో పలుచోట్ల కరెంటు స్తంభాలు కొత్తవి వేసి, పాతవాటిని అక్కడే పడేస్తున్నారని, దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అజెండాలో అన్ని అంశాలకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. వైస్ చైర్‌పర్సన్లు మన్నె పద్మ, గంగ్రోతు అంజనీదేవి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రత్నకుమారి

నవోదయకు రేష్మి ఎంపిక

రంగంపేట: నవోదయ ప్రవేశ పరీక్షలో ముకుందవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని వట్టికూటి రేష్మి ప్రతిభ చూపి ఆరో తరగతిలో ప్రవేశానికి ఎంపికైనట్టు హెచ్‌ఎం సీహెచ్ వెంకటరత్నం గురువారం తెలిపారు. రేష్మి ఎంపిక పట్ల మండల విద్యాశాఖాధికారులు కె.శ్రీనివాసరావు, పి. మధుసూదనరావు, పాఠశాల యాజమాన్య కమి టీ చైర్మన్ సుక్కిరెడ్డి బాపిరాజు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తంచేస్తూ అభినందనలు తెలిపారు.

ఆశాజనకంగా రబీ వరి దిగుబడులు



నందమూరులో వరి పంట ప్రయోగంలో నమూనా సేకరిస్తున్న అధికారులు

కొవ్వూరు: నందమూరు గ్రామంలో వ్యవసాయ, గణాంక శాఖల అధికారుల ఆధ్వర్యంలో గురువారం పంట కోత ప్రయోగం నిర్వహించారు. గ్రామానికి చెందిన గన్నమని సురేష్ వ్యవసాయ క్షేత్రంలో పీఆర్–126 రకంలో ప్రయోగం కోసం నమూనాలు సేకరించారు. పొలంలో నిర్ణీత విస్తీర్ణంలో పంట కోత ప్రయోగం నిర్వహించగా, 26.600 కేజీల దిగుబడి వచ్చిందని ఎంఏఓ ఎ.గంగాధరరావు తెలిపారు. ఎకరం విస్తీర్ణంలో సుమారు 57 బస్తాల దిగుబడి వస్తుందని అంచనా వేశామన్నారు. ఈ రబీలో పంట దిగుబడి ఆశాజనకంగా ఉందన్నారు. జిల్లా గణాంక శాఖ జాయింట్ డైరెక్టర్ ఎల్.అప్పలకొండ, ఉప గణాంకాధికారి జె.సూర్యనారాయణ, సహాయ గణాంకాధికారి బి.నీలిమ, వ్యవసాయ విస్తరణాధికారి ఎస్.శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

పరిస్థితి విషమంగానే..

– ఆస్పత్రి వైద్యుల వెల్లడి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఆత్మహత్యా యత్నం చేసిన ఫార్మసీ విద్యార్థిని పరిస్థితి విషమంగానే ఉందని కిమ్స్ వైద్యులు డాక్టర్ రామరాజు, డాక్టర్ విద్యాదీపక్ తెలిపారు. ఆస్పత్రిలో గురువారం వారు ఆమె ఆరోగ్య పరిస్థితిని వివరించారు. బ్రెయిన్‌కు పూర్తిగా ఆక్సిజన్ సరఫరా తగ్గిపోవడంతో, డ్యామేజ్ ఎక్కువగా ఉందన్నారు. వెంటిలేటర్ ఉండడంతో బీపీ, హార్ట్‌బీట్, పల్స్ నార్మల్‌గా ఉన్నాయన్నారు. కాగా పోలవరం ఎమ్మెల్యే సిర్రే బాలరాజు, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ఆస్పత్రిలో ఆమె పరిస్థితిపై ఆరా తీశారు. ఆమె కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

విద్యార్థి సంఘాల ధర్నా

ఫార్మసీ విద్యార్థిని ఐసీయూలో ఉన్న పరిస్థితిపై విద్యార్థి సంఘాల వారు, కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశాయి. ధర్నా నిర్వహించి, ఒక దశలో ఆస్పత్రిలోకి చొచ్చుకెళ్లేందుకు యత్నించారు. ఆస్పత్రి యాజమాన్యం అడ్డుకోవడంతో ఆందోళన చేశారు. ఎమ్మెల్యేలు వచ్చిన సమయంలోనూ ఆందోళన కొనసాగించారు. ఎవరెవరో వచ్చి వెళ్తున్నారని, సరైన సమాధానం రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు నీటి తొట్టెల పంపిణీ



పంపిణీకి సిద్ధంగా ఉంచిన నీటి తొట్టెలు

రాజమహేంద్రవరం రూరల్: వేసవిని దృష్టిలో ఉంచుకుని జంతువుల దాహాన్ని తీర్చేందుకు జైన్ సేవా సమితి శుక్రవారం నీటి తొట్టెలను పంపిణీ చేయనుంది. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న ఎస్వీ జనరల్ మార్కెట్ రెండో గేటులో షాపు నం.బి2, 3 వద్ద ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం వరకు నీటి తొట్టెలు పంపిణీ చేయనున్నారు.

రక్తదానం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ధన్వంతరి బ్లడ్ బ్యాంక్‌లో గురువారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని టీడీపీ నాయకుడు గన్ని కృష్ణ ప్రారంభించారు. సినీ హీరో రామ్‌చరణ్ జన్మదిన వేడుకల సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు.

రేపు క్యాంపస్ ఇంటర్వ్యూలు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రాజమండ్రి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల జేకేసీ ఆధ్వర్యంలో పీజీ విద్యార్థులకు నారాయణ టెక్నో స్కూల్‌లో అధ్యాపక పోస్టులకు శనివారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్కే, జేకేసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ హరినాథ్‌రెడ్డి గురువారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఏదైనా గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీల్లో పీజీ ఉత్తీర్ణులై లేదా ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులు దీనికి అర్హులని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు శనివారం ఉదయం 10 గంటలకు తమ బయోడేటా, సర్టిఫికెట్ జిరాక్స్‌లతో హాజరు కావాలని తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ రాజమహేంద్రవరం ఈఈ నక్కపల్లి శ్యాముూల్ గురు వారం తెలిపారు. దీంతో పేపర్ మిల్లు జంక్షన్, సీతంపేట, టీచర్స్ కాలనీ, ఈఎస్ఐ హాస్పిటల్ పరిసరాలు, జమీందారు మెట్ట ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు ప్రభావం ఉంటుందన్నారు. అలాగే లాలాచెరువు ఇండస్ట్రియల్ ఏరియా, స్వరూప్‌నగర్, స్పిన్నింగ్ మిల్లు ఏరియా, బత్తినగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకూ అంతరాయం ఉంటుందన్నారు.

నేడు అవగాహన సదస్సు

కడియం: ఎస్సీ, ఎస్టీ, బీసీ గృహ నిర్మాణ లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సాయం అందించేందుకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రమేష్ తెలిపారు. ఈ సదస్సులో సంబంధిత లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాల్సిందిగా కోరారు.